



EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
గురువారం
15-05-2025
పేజీలు: 02



## నేటినుంచి సరస్వతీ పుష్కరాలు

కాళేశ్వరంలో నేటినుంచి పన్నెండురోజుల పాటు జరగనున్న సరస్వతీ పుష్కరాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం పుష్కరాలను ప్రారంభించనున్నారు. పుషరాల్లో ప్రతిరోజా సుమారు 50వేలమంది పుషర స్నానాలు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పుషరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు.భక్తులకు లభించే వివిధ సేవలపై ఇప్పటికే కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించినట్టు పేర్కొన్నారు. ఏర్పాట్లలో భాగంగా నూతన ఘాట్ నిర్మాణం, స్నానాల కోసం షవర్లు, చలువ పందిళ్లు, లైటింగ్, తాగునీటి సౌకర్యం, అదనపు కౌంటర్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణం, పిండ ప్రదాన మండపం, కేశఖండన మండపం, శాశ్వత మరుగుదొడ్లు, స్నానాల గదులు, పుషర ఘాట్‌పై సరస్వతీ అమ్మవారి రాతి విగ్రహం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

## కళాశాలలో భారీ అగ్నిప్రమాదం

ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. పితంపురలోని శ్రీ గురు గోవింద్ సింగ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో గురువారం ఉదయం పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.ఫైర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇవాళ ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. తొలుత కళాశాల లైబ్రరీలో మంటలు చెలరేగాయి. ఆ తర్వాత మంటలు ఇతర అంతస్తులకు వేగంగా వ్యాపించాయి. భారీ ఎత్తున మంటలు ఎగసిపడుతుండటంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగ కమ్ముకుంది. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. దాదాపు 11 అగ్నిమాపక యంత్రాలతో మంటలను అదులోకి తెచ్చారు. అయితే, ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# పాకెట్ వీటో నిర్ణయంపై రాష్ట్రపతి కీలక నిర్ణయం

ఇటీవల సుప్రీంకోర్టు నిర్ణయం గురించి దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. ఏప్రిల్ 8న తమిళనాడు ప్రభుత్వం vs గవర్నర్ కేసులో, సుప్రీంకోర్టుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లేఖ రాశారు. గవర్నర్, రాష్ట్రపతి ఇద్దరికీ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇటీవల స్పష్టం చేసింది. దీనిపై ప్రతిచర్యలు చాలా కాలంగా కొనసాగుతున్నాయి. ఈ విషయంలో, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇప్పుడు సుప్రీంకోర్టు ఉత్తర్వులపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో ఎటువంటి కాలపరిమితి లేనప్పుడు, కోర్టు అలాంటి నిర్ణయం ఎలా ఇవ్వగలదని రాష్ట్రపతి సుప్రీంకోర్టును నేరుగా ప్రశ్నించారు. వాస్తవానికి రాష్ట్రపతి ఈ అభిప్రాయాన్ని సుప్రీంకోర్టు నుండి ఆర్టికల్ 143(1) కింద కోరారు. ఇది అసాధారణ రాజ్యాంగ అధికారం. ఈ నిర్ణయంపై సమీక్ష పిటిషన్ దాఖలు చేస్తే, తీర్పు ఇచ్చిన బెంచ్ దానిని సభలోనే తిరస్కరించవచ్చని రాష్ట్రపతికి తెలుసు. అటువంటి పరిస్థితిలో, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ద్వారా రాజ్యాంగ వివరణకు సంబంధించిన 14 ముఖ్యమైన ప్రశ్నలను సుప్రీంకోర్టు ముందు ఉంచింది. రాజ్యాంగంలోని 200, 201 అధికరణలు గవర్నర్, రాష్ట్రపతి బిల్లులను పరిశీలించడానికి ఎటువంటి కాలపరిమితిని లేదా విధానాన్ని నిర్దేశించలేదని రాష్ట్రపతి తన లేఖలో స్పష్టం చేశారు. ఈ నిర్ణయాలు అనేక అంశాలపై ఆధారపడి ఉన్నాయని అన్నారు. ఇందులో సమాఖ్యవాదం, చట్టాల ఏకరూపత, దేశ భద్రత, అధికారాల విభజన వంటి సూత్రాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు 'డీమ్డ్ అసెంట్' అనే భావన రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణానికి విరుద్ధమని రాష్ట్రపతి పేర్కొన్నారు.ఏప్రిల్‌లో జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం కోర్టు ప్రత్యేక అధికారాలను ఉపయోగించి తమిళంలో



డిఎంకె ప్రభుత్వం, గవర్నర్ ఆర్ఎన్ రవి మధ్య నిలిచిపోయిన బిల్లులపై తలెత్తిన ఘర్షణను పరిష్కరించింది. గవర్నర్ 10 బిల్లులను ఆమోదించడానికి నిరాకరించడం చట్టవిరుద్ధం, ఏకపక్షం అని కోర్టు పేర్కొంది. శాసనసభ రెండవసారి ఆమోదించిన బిల్లులను ఆమోదించడానికి రాష్ట్రపతి,యు గవర్నర్‌లకు మూడు నెలల గడువును విధించింది. రాజ్యాంగపరమైన విషయాలపై రాష్ట్రపతి కోర్టులను సంప్రదించాలని కూడా తీర్పు పేర్కొంది. ఈ విషయం విధానాలకు సంబంధించినది. అయితే, సుప్రీంకోర్టు తన సలహా అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి నిరాకరించవచ్చని ధర్మాసనం పేర్కొంది. పూర్తిగా రాజకీయ పరిగణనలతో కూడిన విషయాలలో కోర్టు స్వీయ-విధించిన నియంత్రణను పాటించడం రాజకీయ చిక్కుల సిద్ధాంతానికి అనుగుణంగా ఉంటుంది.

అంటే, రాజ్యాంగం కార్యనిర్వాహక శాఖకు మాత్రమే ప్రత్యేక హక్కులు ఇచ్చే పాలనా రంగాలలోకి కోర్టులు ప్రవేశించవు. అయితే, కొన్ని అసాధారణ పరిస్థితులలో, గవర్నర్ బిల్లు ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రమాదకరం అనే కారణంతో రాష్ట్రపతి పరిశీలన కోసం బిల్లును రిజర్వ్ చేయవచ్చు. అటువంటి చట్టానికి అనుమతి ఇవ్వాలా వద్దా అని నిర్ధారించడానికి రాజ్యాంగం వివరణ అవసరం. రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా లేకపోవడం, రాజ్యాంగ చెల్లుబాటు ప్రశ్నలను కలిగి ఉండటం అనే కారణంతో బిల్లును ప్రధానంగా రిజర్వ్ చేసిన సందర్భాలలో, కార్యనిర్వాహకుడు సంయమనం పాటించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టుకు రాసిన లేఖలో రాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టుకు 14 ప్రశ్నలు సంధించారు రాష్ట్రపతి.



## నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ప్రారంభమయ్యాయి. బ్లూ చిప్ స్టాక్స్, ఆసియా మార్కెట్లలో ప్రతికూల పవనాల నేపథ్యంలో నష్టాల్లో మొదలయ్యాయి. 30 షేర్ల బీఎస్ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్ ప్రారంభ ట్రేడింగ్‌లో 106.78 పాయింట్లు పతనమై.. 81,223.78 పాయింట్లకు చేరుకుంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 38.45 పాయింట్లు తగ్గి.. 24,628.45 పాయింట్లకు చేరుకుంది. ప్రస్తుతం సెన్సెక్స్ 280.95 పాయింట్లు తగ్గి.. 81,049.61 పాయింట్ల వద్ద కొనసాగుతుంది. నిఫ్టీ 58.85 పాయింట్ల తగ్గి 24,608.05 పాయింట్ల వద్ద ట్రేడవుతున్నది. సెన్సెక్స్‌లో పవర్ గ్రిడ్, ఇండస్ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, సన్ ఫార్మా, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు నష్టాలను చవిచూశాయి. టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్ లాభాలను నమోదు చేశాయి.



## జూన్ 5 నుంచి ఓటిటిలోకి 'హిట్ 3'

నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన లేటెస్ట్ అవైటెడ్ చిత్రం "హిట్ 3" కోసం అందరికీ తెలిసిందే. తెలుగు స్టేట్స్ నుంచి యూఎస్ మార్కెట్ వరకు హిట్ 3 భారీ వసూళ్లు సాధించింది. ఇక ఈ సినిమా థియేటర్స్ లో ఇప్పటికీ బాగానే కొనసాగుతుండగా ఫైనల్ గా ఈ సినిమా ఓటిటి రిలీజ్ కి బజ్ వినిపిస్తుంది. దీని ప్రకారం ఈ చిత్రం ఈ జూన్ 5 నుంచి స్ట్రీమింగ్ కి రానుందట. ఈ సినిమా పాన్ ఇండియా ఓటిటి హక్కులు దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. మరి ఇందులో అప్పుడు నుంచి రానుందట. మరి దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందించగా శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా నటించింది అలాగే అడివి శేష్, కార్తీలు సాలిడ్ క్యామియోస్ లో నటించారు. అలాగే నానినే ఈ చిత్రానికి నిర్మాణం కూడా వహించిన సంగతి తెలిసిందే.



## ఆకాంక్ష శర్మ అందాల విందు

బాద్షా 'జుగ్ను' పాటలో కనిపించిన ఆకాంక్ష శర్మ బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. త్వరలో ఆమె సునీల్ శెట్టి, వివేక్ ఒబెరాయ్ మరియు సూరజ్ పంచోలి నటించిన 'కేసరి వీర్: లెజెండ్స్ ఆఫ్ సోమనాథ్' చిత్రంలో కనిపించనుంది.ఈ చిత్రంలో ఆయనకు నిర్భయ యోధుడు రాజల్ పాత్ర లభించింది.ఈ చిత్రం నుండి ఆమె ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రం మే 16న థియేటర్లలో విడుదల కానుంది.ఆ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది.... పోస్టర్ లో ఆకాంక్ష లుక్ అద్భుతంగా ఉంది. ఆమె ముఖంలో ఉత్సాహం, ఆత్మవిశ్వాసం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆమె కళ్ళలో ఎంత తేజస్సు, ధైర్యం ఉన్నాయంటే అది అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.


## రెండో రోజు సిట్ విచారణకు ధనుంజయ్, కృష్ణ మోహన్

ఏపీ లిక్కర్ స్కాం కేసులో ధనుంజయ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి రెండో రోజు సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. లిక్కర్ స్కాంకు సంబంధించి ఇరువురిని సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు. నిన్నటి (బుధవారం) విచారణలో ఇద్దరిని వివిధ రూపాలలో సిట్ ప్రశ్నించింది. అయితే సరైన సమాధానాలు చెప్పకపోవడంతో ఈరోజు (గురువారం) మరోసారి విచారణకు రావాల్సిందిగా సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ క్రమంలోనే ఉదయం 10 గంటలకు ధనుంజయ్, కృష్ణ మోహన్ రెడ్డి సిట్ విచారణకు హాజరయ్యారు. నేటి సాయంత్రం వరకు విచారణ కొనసాగే అవకాశం ఉంది. కృష్ణ మోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డిలను వేరు వేరుగా విచారించనున్నారు. అయితే మద్యం కుంభకోణంలో తమ పాత్ర లేదని వారు చెబుతుండగా.. ప్రమేయం ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని సిట్ అధికారుల మాట. మరి ఈరోజు విచారణలో సిట్ అధికారులకు సహకరిస్తారా లేదా అనేది చూడాలి. కాగా.. మద్యం కుంభకోణం కేసులో సిట్ విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో




ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. ముఖ్యంగా రెండు రోజుల క్రితం ఈ కేసులో ఏ33గా ఉన్న గోవిందప్ప బాలాజీని మైసూర్‌లో సిట్ అధికారులు అదుపులోకి తీసుకుని విజయవాడకు తరలించి విచారించారు. ఆపై నిన్న (బుధవారం) ఏసీబీ కోర్టులో హాజరుపర్చారు. గోవిందప్పకు ఈనెల 20 వరకు రిమాండ్ విధించడంతో వెంటనే జైలుకు తరలించారు. అంతేకాకుండా గోవిందప్ప రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెల్లడించింది సిట్. గత ప్రభుత్వంలో జరిగిన లిక్కర్ కుంభకోణంలో బాలాజీ గోవిందప్ప కీలక పాత్ర పోషించారని, జగన్ కుటుంబానికి సన్నిహితంగా ఉండే వ్యక్తి కాబట్టే ఈ స్కాంలో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు రిమాండ్ రిపోర్టులో తెలిపారు.

## గాజాపై ఇజ్రాయెల్ దాడి.. 70 మంది మృతి



గాజాపై వైమానిక దాడులతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఈ దాడిలో 22 మంది చిన్నారులు సహా 70 మంది ప్రాణాలు కోల్పోయారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సౌదీ పర్యటనలో ఉండగానే ఇజ్రాయెల్ ఈ దాడులకు పాల్పడటం గమనార్హం. అమెరికా మధ్యవర్తిత్వంతో కుదిరిన ఒప్పందం ప్రకారం హమాస్ ఒక ఇజ్రాయెల్-అమెరికన్ బందీని విడుదల చేసిన మరుసటి రోజే ఇజ్రాయెల్ ఈ దాడులకు పాల్పడింది. కాగా, మంగళవారం ఇజ్రాయియెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ మాట్లాడుతూ.. గాజాలో తమ యుద్ధాన్ని ఆపడానికి ఎటువంటి మార్గాలు లేవని పేర్కొనడంతో కాల్పుల విరమణపై అవకాశాలు సన్నగిల్లాయి.



## నీరజ్ చోప్రాకు లెఫ్ట్‌నెంట్ కర్నల్ హోదా

భారత గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రాకు మరో అరుదైన గౌరవం దక్కింది. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం, పారిస్‌లో రజతం సాధించిన నీరజ్‌కు భారత సైన్యం లెఫ్టినెంట్ కర్నల్ హోదా అందించింది.ఈ మేరకు బుధవారం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. 2016లో నయీబ్ సుబేదార్ హోదాలో ఆర్మీలో చేరిన నీరజ్.. టోక్యోలో పసిడి తర్వాత సుబేదార్ హోదా పొందాడు. 2022లో కేంద్ర ప్రభుత్వం అతడిని పద్మశ్రీతో సత్కరించింది.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# చార్‌ధామ్ యాత్రకు భారీ స్పందన.. 150 దేశాల నుంచి రిజిస్ట్రేషన్లు..!

చార్‌ధామ్ యాత్రకు ప్రపంచం నలుమూలల నుంచి స్పందన వస్తున్నది. ఇప్పటి వరకు దాదాపు 28లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నది. 150కిపైగా దేశాల నుంచి 31,581 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో ఎక్కువ మంది అమెరికా, నేపాల్, మలేషియా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా నుంచే ఎక్కువగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఉత్తరాఖండ్ హిమాలయ ప్రాంతాల్లో ఉన్న కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి ధామ్‌లతో పాటు హేమకుండ్ సాహిబ్ సందర్శించుకునేందుకు పర్యాటకులు ఆసక్తి చూపిస్తున్నట్లుగా పర్యాటశాఖ రిజిస్ట్రేషన్ గణాంకాలు చూపిస్తున్నారు. నేపాల్ నుంచి 5,728 మంది ప్రయాణికులు రిజిస్టర్ చేసుకున్నారు. అలాగే, 150 కిపైగా దేశాల నుండి ప్రయాణికులు రిజిస్టర్ చేసుకున్నారని అధికారులు తెలిపారు.అమెరికా నుంచి 5,864, యూకే నుంచి 1,559, మారిషస్ నుంచి 837, ఇండోనేషియా నుంచి 327, కెనడా నుంచి 888, ఆస్ట్రేలియా నుంచి 1,259 పేర్లను నమోదు చేసినట్లుగా పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ నోడల్ అధికారి యోగేంద్ర గంగ్వార్ మాట్లాడుతూ.. ప్రపంచంలోని ప్రతి దేశం నుంచి ప్రజలు చార్‌ధామ్ యాత్రకు రావడానికి నమోదు చేసుకుంటున్నారని తెలిపారు. చార్‌ధామ్ యాత్ర ఏప్రిల్ 30న ప్రారంభమైంది. మే 14 వరకు 7.18 లక్షలకుపైగా భక్తులు చార్‌ధామ్‌ను సందర్శించారు.




# నర్సులు, టీచర్లకు యూఏఈ గోల్డెన్ వీసా

నర్సులకు పదేళ్ల గోల్డెన్ వీసా ఇవ్వనున్నట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఈ నెల 12న ప్రకటించింది. దుబాయ్ హెల్త్ శాఖలో 15 సంవత్సరాలకుపైగా పని చేసిన అనుభవం కలవారికి ఈ వీసాను ఇస్తామని తెలిపింది. ఎంపిక చేసిన విదేశీయులకు 10 ఏళ్ల రెసిడెన్సీని ఇచ్చే గోల్డెన్ వీసా పథకాన్ని 2019లో ప్రారంభించారు.విద్య, వైద్య రంగాల్లో క్వాలిఫైడ్ ప్రొఫెషనల్స్; పెట్టుబడిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు; సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మక పరిశ్రమలు, గేమింగ్ వంటి రంగాల్లో పని చేసే నైపుణ్యంగల కార్మికులు ఈ వీసాను పొందవచ్చు. పదేళ్ల గోల్డెన్ వీసా పథకాన్ని టీచర్లు, విద్యావేత్తలకు కూడా వర్తింపజేస్తామని విజ్ఞానం, మానవాభివృద్ధి సంస్థ ప్రకటించింది. దుబాయ్‌లోని ప్రైవేట్ ఎడ్యుకేషన్ ప్రొఫెషనల్స్‌కు ఇది వర్తిస్తుందని తెలిపింది. శిశు సంరక్షణ కేంద్రాలు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలలో పని చేస్తూ, అద్భుతమైన పనితీరు కనబరచిన, విద్యా ప్రమాణాలను పెంచినవారికి గోల్డెన్ వీసా ఇస్తామని చెప్పింది.



# నవీన్ చంద్ర ఇంటర్వ్యూ

నవీన్ చంద్ర హీరోగా నటించిన బైలింగ్వెల్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ లెవన్. లోకేశ్ అజ్ల్స్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. AR ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించారు. ఈ చిత్రం వేసవిలో అద్భుతమైన సినిమా ఎక్స్ పీరియన్స్ ని అందించడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. రుచిర ఎంటర్టైన్మెంట్స్ ప్రముఖ డిస్ట్రిబ్యూటర్ ఎన్ సుధాకర్ రెడ్డి ఈ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. మే 16న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

సినిమాకి లెవన్ అనే టైటిల్ పెట్టడానికి కారణం?
అది కథ నుంచి వచ్చిన టైటిల్. సినిమా చూసినప్పుడు మీకే తెలుస్తుంది. సినిమాపై చాలా కాన్ఫిడెంట్ గా వున్నాను. తమిళ్ లో షోస్ జరిగాయి. యునానిమాస్ గా సూపర్ రెస్పాన్స్.. చూసిన ఆడియన్స్ స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. మేము అనుకున్న ట్విస్ట్ లు, టర్న్స్, అడ్రినల్ రష్ మూమెంట్స్ ప్రేక్షకులని ఎక్సయిట్ చేశాయి. ఆడియన్స్ రెస్పాన్స్ పట్ల చాలా హ్యాపీగా వున్నాను. చాలా సంవత్సరాల తర్వాత మంచి థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ దొరికింది.

ఈ థ్రిల్లర్ ఎంత కొత్తగా ఉండబోతోంది?
ఇప్పటివరకూ ఏ థ్రిల్లర్ లో రాని ఒక డిఫరెంట్ ఎమోషనల్ కాన్సెప్ట్ ఈ సినిమాలో వుంది. ఆడియన్స్ కి చాలా కొత్త ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది. ఇందులో ప్రతిదానికి లాజిక్ వుంటుంది. ఇందులో ట్విస్ట్ లని ముందుగా డీకోడ్ చేయడం కష్టం.

స్క్రీన్ ప్లే ఎలా ఉండబోతోంది? డైరెక్టర్ లోకేష్ గురించి?
మంచి రైటింగ్ బలం వున్న సినిమా. తెలుగు తమిళ్ రెండు భాషల్లో సినిమా చేయడానికి దాదాపు ఆరు నెలలు సినిమా ప్రీప్రొడక్షన్ చేశాం. లెవన్ చూస్తున్నపుడు విజువల్ గా ఓ కమర్షియల్ సినిమా చూస్తున్న ఫీలింగ్ కలిగిస్తుంది. నిర్మాతలు చాలా ఖర్చు చేశారు. ఇది డైరెక్టర్, టెక్నికల్ ఫిల్మ్. లోకేష్ సినిమాని చాలా అద్భుతంగా తీశాడు. సినిమా చూసిన వారంతా డైరెక్టర్ గురించి, రైటింగ్ గురించి ప్రత్యేకంగా చెబుతున్నారు. ఈ సినిమా ఫస్ట్ హాఫ్ ఎంగేజ్ చేస్తుంది. సెకండ్ హాఫ్ మైండ్ బ్లోయింగ్ గా వుంటుంది.

రెండు భాషల్లో సినిమాని షూట్ చేశారా?
అవును. రెండు భాషల్లో డిఫరెంట్ డిఫరెంట్ షాట్స్ తీశాం. స్క్రిప్ట్ ని కూడా ట్రాన్స్ లేట్ చేయలేదు. తెలుగు నుంచి ప్రత్యేకంగా రైటర్ తో రాయించి తెలుగు స్క్రిప్ట్ తో షూట్ చేశాం. నిర్మాతలు ఎక్కడ రాజీపడకుండా ఖర్చు చేశారు. తెలుగు తమిళ్ బైలింగ్వల్ చేయడం ఇప్పుడు అడ్వాంటేజ్ గానే భావిస్తున్నాను. ఈ సినిమాకి తమిళ్ డబ్బింగ్ నేనే చెప్పాను. నాకు ఎనిమిది భాషలు వచ్చు. నా అన్ని సినిమాలకి ప్రతి భాషలో నేనే డబ్బింగ్ చెప్పడానికి ప్రాధాన్యత ఇస్తుంటాను.

మాస్ జాతర లో మీ క్యారెక్టర్ ఎలా వుండబోతోంది?
రవితేజ గారికి విలన్ గా చేయాలని సితార నుంచి కాల్ వచ్చింది. రిఫర్ చేసింది కూడా రవితేజ గారే. అరవింద సమేత లో నా క్యారెక్టర్ ని ఎలా యూనిక్ గా ఫీల్ అయ్యారో.. అంతే యూనిక్ గా ఈ సినిమాలో వుంటుంది. నా లుక్ కూడా చాలా వెరైటీగా వుంటుంది.




# బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మోసం

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ మోసం వెలుగులోకి వచ్చింది. గత 15 సంవత్సరాలుగా చేతన్ జ్యువెలర్స్ పేరిట కూకట్‌పల్లి, ప్రగతి నగర్‌లో నితీష్ జైన్ అనే వ్యక్తి బంగారం వ్యాపారం చేస్తున్నాడు.. అతని వద్దకు వచ్చే కస్టమర్ల నుంచి సుమారు రూ.10 కోట్ల విలువ చేసే బంగారం, ఆభరణాలతో పరారయ్యాడు. మోసపోయినట్లు గ్రహించిన బాధితులు ఒక్కొక్కరుగా బయటకి వస్తున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి నితీష్ జైన్ షాపు తెరవకపోవడంతో జనాలకు అనుమానం వచ్చింది. దీంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నితీష్ జైన్ స్థానికంగా ఉన్న బంగారు దుకాణాల వద్ద బంగారాన్ని తీసుకు వచ్చి ఆభరణాలు చేయడంతో పాటు కస్టమర్లకు అమ్ముతూ దుకాణదారులకు దగ్గరయ్యాడు. ఈ విధంగా తన నెట్‌వర్క్‌ను పెంచుకుంటూ అందరికీ నమ్మకం కలిగించి ఒక్కసారిగా భారీగా బంగారు ఆభరణాలతో పరారయ్యాడు. నితీష్ జైన్‌కు నగల దుకాణాదారులు భారీ మొత్తంలో బంగారం ఇచ్చారు. ఇప్పుడు అతని ఆచూకీ తెలియక లబోదిబో మంటున్నారు. బంగారాన్ని తాకట్టు పెట్టుకుని డబ్బులు వడ్డీలకు ఇస్తుండే వాడని, స్కీంలు సయితం పెట్టి అందరినీ నితీష్ జైన్ ఆకట్టుకున్నాడని బాధితులు తెలిపారు. కేపీహెచ్‌బీ, బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జైన్ తన వ్యాపారాన్ని నిర్వహించాడు.



# మణిపూర్‌లో ఎన్‌కౌంటర్.. పది మంది మిలిటెంట్లు హతం

ఈశాన్య భారతంలోని మణిపూర్‌లో భద్రతా బలగాలు భారీ విజయం సాధించాయి. చందేల్ జిల్లాలో పది మంది మిలిటెంట్లను హతమార్చాయి. ప్రస్తుతం ఆపరేషన్ ఇంకా కొనసాగుతుందని సైన్యానికి చెందిన తూర్పు కమాండ్ పేర్కొంది. అయితే, చందేల్ జిల్లాలోని న్యూ సామ్తాల్ గ్రామంలో అనుమానాస్పద కార్యకలాపాల గురించి నిఘా సమాచారం అందిందని తూర్పు కమాండ్ పేర్కొంది. ఆ తర్వాత స్పియర్ కార్ప్స్ ఆధ్వర్యంలోని అసోం రైఫిల్స్ ఆపరేషన్ చేపట్టిందని పేర్కొంది. భారత్-మయన్మార్ సరిహద్దులోని చందేల్ జిల్లాలో 14న ఆపరేషన్ మొదలుపెట్టిన పేర్కొంది. ఈ క్రమంలో అనుమానిత వ్యక్తులు సైనికులపై కాల్పులు జరిపారని.. వెంటనే భద్రతా బలగాలు సైతం కాల్పులు జరిపినట్లు తెలిపింది. ఈ కాల్పుల్లో పది మంది మరణించారని సైన్యం వివరించింది. సంఘటనా స్థలం నుంచి పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుడును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది.

# సింధూ జలాలను వదలండి.. భారత్‌కు పాక్ రిక్వెస్ట్..!

సింధూ జలాల నిలిపివేతపై తీసుకున్న నిర్ణయాన్ని పునః పరిశీలన చేయాలంటూ పాకిస్థాన్ జల వనరుల మంత్రిత్వ శాఖ భారత్‌కు విజ్ఞప్తి చేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సింధూ జలాల నిలిపివేత కారణంగా తమ దేశంలో నీటి సంక్షోభం ఏర్పడుతుందని భారత విదేశాంగ శాఖకు ఆ దేశ జల వనరుల శాఖ ఒక లేఖ రాసింది. ఈ విషయంలో తన నిర్ణయాన్ని మార్చుకుని, యథావిధిగా పాక్‌కు నీటిని వదలాలని కోరింది. కాగా, సింధూ జలాలు పాక్‌కు చేరకుండా భారత్ ఇప్పటికే స్వల్ప, మధ్య, దీర్ఘకాల ప్రణాళికలను ప్రకటించింది.

# జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

జమ్మూకశ్మీర్ అవంతిపొరాలో ఎన్‌కౌంటర్ జరిగింది. నాదర్, ట్రాల్ ప్రాంతాల్లో భద్రతాబలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. అటవీప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారంతో భద్రతాబలగాలు రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలో ఈరోజు (గురువారం) ఉదయం భద్రతాబలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో జైషే మహ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు హతం చేశాయి. కాగా జమ్మూకశ్మీర్‌లో గడిచిన 48 గంటల్లో ఇది రెండో ఎన్‌కౌంటర్. జమ్మూకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న అనుమానంతో భద్రతాబలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. అటవీప్రాంతాల్లో అణువణువు జల్లెడపడుతున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పహల్గాం నిందితులు, ఉగ్రవాదులను భద్రతాబలగాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆ వేటలో



భాగంగానే ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. కొన్ని కొత్త ప్రదేశాల్లో ఉగ్రవాదులు దాగి ఉన్నట్లు గుర్తించిన భద్రతా బలగాలు వారి కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. పాకిస్థాన్ నుంచి వచ్చిన చొరబాటు ఉగ్రవాదులను మట్టుబెడుతున్నాయి. ఈరోజు ఉదయం టెర్రరిస్టుల కోసం గాలించగా నాదర్ , ట్రాల్ ప్రాంతాల్లో తారసపడ్డారు. భద్రతాబలగాలను చూసిన వెంటనే ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. వెంటనే భద్రతాబలగాలు కూడా ప్రతిగా కాల్పులు జరుపుతున్నాయి. అయితే ఈ కాల్పుల్లో ఓ ఉగ్రవాది మరణించినట్లు సమాచారం.

# చేయి విరిగిందని ఆస్పత్రికొస్తే.. ఏకంగా ప్రాణాలే తీశారు!

తెలుగు రాష్ట్రాల్లో నకిలీ వైద్యుల దందా నానాటికీ పెచ్చుమీరుతుంది. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను కూడా నయం చేయలేక చేతులెత్తేస్తున్నారు. తాజాగా ఓ మహిళ చేయి విరిగిందని ఆస్పత్రికి వస్తే శస్త్రచికిత్స పేరిట ఏకంగా ఆమె ప్రాణాలనే మింగేశాడో నకిలీ వైద్యుడు. ఈ షాకింగ్ ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా సంగివలసలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో బుధవారం (మే 14) వెలుగులోకి వచ్చింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ నిండుప్రాణం బలి కావడంతో స్థానికుల్లో ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం జిల్లా తగరపువలస సమీపంలోని జీరుపేట గ్రామంలో నివాసముంటున్న ఎర్రంశెట్టి రేవతి (22) అనే మహిళ స్వస్థలం అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలంలోని కొవ్వూరు



గ్రామం. ఆమె భర్త జనార్దన్ చిప్పాడ దివీస్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి నాలుగేళ్లు, తొమ్మిది నెలల కుమారులు ఉన్నారు. రేవతి మే 6న ఇంట్లోని బాత్‌రూంలో జారి కింద పడిపోయింది. దీంతో ఆమె కుడిచేయి విరిగింది. వెంటనే సంగివలస ఎన్నారై (ఏఎన్‌హెచ్) ఆసుపత్రిలో బంధువులు ఆమెను చేర్పించారు. ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పడంతో.. అందుకు అవసరమైన బీమా సదుపాయం ఉన్నట్లు తెలిపారు. అయితే వాటికి సంబంధించిన అనుమతులు వచ్చాకే ఆపరేషన్ చేస్తామని వైద్యులు చెప్పారు.

# కేక పెట్టించిన లవ్లీ హీరోయిన్

శాన్వి శ్రీవాస్తవ మోడల్ ద్వారా కెరీర్ మొదలు పెట్టింది. ఈ అమ్మడు ఎక్కువగా కన్నడ, తెలుగు సినిమాల్లో నటించింది. ఈ బ్యూటీ డిసెంబర్ 8, 1993న వారణాసిలో జన్మించింది. శాన్వి తన నటనా జీవితాన్ని 2012లో "లవ్లీ" చిత్రంతో ప్రారంభించింది. ఆ సమయంలో ఆమె ఇంకా చదువుతోంది.తెలుగులో లవ్లీ సినిమా తర్వాత "అడ్డా" (2013) , "రౌడీ" (2014) వంటి చిత్రాల్లో ఆమె నటన విమర్శకుల ప్రశంసలు పొందింది. శాన్వి ముంబైలోని ఠాకూర్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ కామర్స్‌లో తన బి.కామ్ డిగ్రీని పూర్తి చేసింది. కన్నడ సినిమాలైన "మాస్టర్‌పీస్" (2015), "తారక్" (2017), "ముఫ్తీ" (2017), మరియు "అవనే శ్రీమన్నారాయణ" (2019) వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించింది. ఆమె "మాస్టర్‌పీస్" చిత్రానికి SIIMA క్రిటిక్స్ అవార్డ్ ఫర్ బెస్ట్ యాక్ట్రెస్ (కన్నడ) "తారక్" చిత్రానికి SIIMA అవార్డ్ ఫర్ బెస్ట్ యాక్ట్రెస్ (కన్నడ) గెలుచుకుంది.ఈ బ్యూటీ చేసింది తెలుగులో నాలుగు సినిమాలే.. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. కొన్ని సినిమాల్లో తన అందంతో ప్రేక్షకులను కవ్వించింది.

